క్లుప్తంగా

108 అంబులెన్స్‌లో ప్రసవం



కమలాపూర్ : 108 వాహనంలోనే ఓ మహిళ ప్రసవించిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. 108 వాహన ఈఎంటీ బండ ఉపేందర్, పైలట్ బి.సందీప్ కథనం ప్రకారం .. మండలంలోని గోపాల్‌పూర్‌కు చెందిన ఇంగ్లె సంధ్య (22) పురిటి నొప్పులతో బాధపడుతుండగా స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో ఉప్పల్ దాటిన తర్వాత సంధ్యకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి ఈఆర్‌సీపీ డాక్టర్ శ్రీకాంత్ సూచనలు, సలహాలతో సిబ్బంది సురక్షితంగా డెలివరీ చేశారు. సంధ్యకు పండంటి ఆడశిశువుకు జన్మించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

బైరి నరేశ్‌కు డాక్టరేట్



కమలాపూర్ : మండలంలోని రాములపల్లికి చెందిన ప్రముఖ హేతువాది, తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త బైరి నరేశ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రకటించింది. ఆ యూనివర్సిటీ ప్రభుత్వ పాలన శాస్త్ర ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి పర్యవేక్షణలో 'మూఢనమ్మకాలు–ప్రభుత్వ పాలన–ములుగు, హనుమకొండ జిల్లాల అధ్యయనం'పై నరేశ్ సమర్పించిన పరిశోధన గ్రంథానికి గాను పీహెచ్‌డీ అందింది. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడారు. తన తల్లిదండ్రులు అన్నపూర్ణ–ధర్మయ్యలతో పాటు భార్య సుజాత, పిల్లలకు పీహెచ్‌డీని అంకితమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్‌ను ఓయూ వైస్ చాన్స్‌లర్ రవీందర్, రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి, ప్రభుత్వ పాలనశాస్త్ర విభాగం హెచ్‌ఓడీ డి.బాలబ్రహ్మచారి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ అరుణజ్యోతి, ప్రొఫెసర్లు అమరేందర్‌రెడ్డి, సోఫీ అలీ అభినందించారు.

'కాంగ్రెస్' సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రాజేందర్



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామానికి చెందిన ఉడుత రాజేందర్‌ను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్‌గా నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని రాజేందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మీడియాతో మాట్లాడారు. తనను నియమించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



పరకాల : పట్టణానికి చెందిన సాంబరాజు రాజు సెల్‌ఫోన్ పోగొట్టుకొని సీఈఐఆర్ అప్లికేషన్‌లో ఫిర్యాదు చేయగా స్థానిక పోలీసులు దొరకబట్టి బాధితుడికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ కిషన్ మాట్లాడారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు సీఈఐఆర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై శివకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కేటీఆర్‌ను విమర్శించే స్థాయి 'కొండా'కు లేదు

ఆత్మకూరు : రాష్ట్ర ఐటీ శాఖమంత్రి కేటీఆర్‌ను విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి లేదని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి అర్షం మధుకర్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తూ కేటీఆర్ యూత్ ఐకాన్‌గా మారారని పేర్కొన్నారు. గతంలో కొండా మురళి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు.

జిల్లా స్థాయి టీఎల్‌ఎం పోటీల్లో ప్రథమ బహుమతి



కమలాపూర్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యా దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో విద్యా శాఖ అధ్వర్యంలో నిర్వహించిన సోమవారం జిల్లా స్థాయి ఎఫ్ఎల్ఎన్–టీఎల్ఎం మేళాలో ×ఈవీఎస్–పరిసరాల విజ్ఞానం× అంశంలో మండలంలోని ఉప్పల్ ఎంపీపీ స్కూల్‌లో పని చేస్తున్న భీంపెల్లి గ్రామానికి చెందిన పోశాల చంద్రం ప్రథమ బహుమతికి ఎంపికయ్యాడు. చంద్రం తయారు చేసి ఈవీఎస్–టీఎల్ఎం రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. నేడు(మంగళవారం) అంబేద్కర్ భవన్‌లో జరిగే విద్యా దినోత్సవంలో మంత్రులు, కలెక్టర్ చేతుల మీదుగా చంద్రం బహుమతిని అందుకోనున్నారు.

పరకాల : బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్



పరకాల : మొక్కలు నాటుతున్న ఏసీపీ, ఇతరులు



దామెరలో..



పర్యావరణాన్ని పరిరక్షించాలి

పరకాల : సమాజంలోని ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షించాలని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ అభివర్ణించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ హరితోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ ఇళ్లలో, పరిసరాల్లో మొక్కలను నాటి పరిరక్షించాలని ఆకాంక్షించారు. ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ పర్యావరణ విభాగం కోఆర్డినేటర్ పిట్టల రవిబాబు మాట్లాడుతూ ప్రకృతి తల్లి లాంటిదని చెప్పారు. ప్రకృతిని శ్వాస ఉన్నంత వరకు ఊపిరి పోస్తుందని తెలిపారు. తొలుత హరితోత్సవంపై అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ, క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు ఆమె బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బిక్షపతి, ప్రధానోపాధ్యాయురాలు బైరి మాధవి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు మైసయ్య, సురేశ్ పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో...

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ జే.శివరామయ్య మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలను నాటి రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీఐ పుల్యాల కిషన్, ఎస్సైలు ప్రశాంత్‌బాబు, హరికృష్ణ, శివకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దామెర : మండల కేంద్రంలో ఎంపీపీ కాగితాల శంకర్, తదితరులు మొక్కలు నాటారు. అనంతరం ఎంపీపీ శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కుసుమ నాగరాజు, సర్పంచ్ గరిజాల శ్రీరాంరెడ్డి, ఎంపీటీసీ పోలం కృపాకర్‌రెడ్డి, ఏపీఓ శారద, ఏపీఎం ఝాన్సీ, కార్యదర్శి నరేశ్, కోఆప్షన్ సభ్యుడు హింగె బాబురావు, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో..



కమలాపూర్‌లో..

ఆత్మకూరు : మండల కేంద్రంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి మొక్కలు నాటి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ వంగాల స్వాతి భగవాన్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మండల కేంద్రంలోని, ఎంపీపీ మార్నేని మధుమతి పున్నేలు, పంథిని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో, నర్సరీల్లో మొక్కలు నాటారు. అన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ రవీందర్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో పచ్చదనం పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలులో..



నడికూడలో..

కమలాపూర్ : ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో, మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రముఖుల రాశుల ఆధారంగా పొగడ, పనస, రావి, వేప, అశోక, జమ్మి, మర్రి తదితర మొక్కలు నాటారు. మండలంలో తొలిసారిగా ప్రయోగాత్మకంగా 15–20 లీటర్ల నీరు నిల్వ ఉండే ప్లాంట్ బాక్సులు ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. అనంతరం ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్, జెడ్పీటీసీ లాండగె కల్యాణి లక్ష్మణ్‌రావు, ఎంపీడీఓ పల్లవి మాట్లాడారు. తదనంతరం గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీఓ విమల, సర్పంచ్ విజయ తిరుపతిరెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : మండల కేంద్రంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ ఊర రవీందర్ మొక్కలను నాటి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం రమాదేవి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలసల నివారణే 'ఉపాధి' లక్ష్యం

- రూ.16,762 జరిమానా
- వెలవెలబోయిన ప్రజావేదిక

శాయంపేట : వలసల నివారణ కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టం కింద పనులు చేపడుతున్నాయని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావేదికకు ఆయన అధ్యక్షత వహించారు. మండలంలో 2021 ఫిబ్రవరి 1 నుంచి 2023 మార్చి 31 వరకు రూ.6.61 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులపై 14వ విడిత సామాజిక తనిఖీ సభ్యులు ఈనెల 4 నుంచి 18 వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేపట్టి గ్రామసభలు నిర్వహించి ఓపెన్ ఫోరంలో వివరాలు వెల్లడించారు. గోవిందాపూర్‌లో ఇద్దరు బాలలకు జాబ్ కార్డులు జారీ చేశారని, మల్టీపర్పస్ ఉద్యోగి భిక్షపతి పనులు చేయకుండా సంతకాలు పెట్టారని తెలిపారు. పెద్దకోడెపాక ఫీల్డ్ అసిస్టెంట్ భిక్షపతి కూలీలకు పేస్లిప్ ఇవ్వడం లేదని, జాబ్ కార్డులు అప్‌డేట్ చేయలేదని, అవెన్యూ ప్లాంటేషన్‌లో సగం మొక్కలు చనిపోయాయని, ఎంఐ ట్యాంకు పనుల్లో కూలీలు మస్టర్‌లో సంతకాలు చేయకుండా పేమెంట్ ఇచ్చారని చెప్పారు. సెప్టెంబర్‌లో వర్షాలు కురుస్తున్నా ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీరు పట్టామని బిల్లులు తీసుకున్నారని తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. గ్రామాల్లోని కూలీలకు పనులు కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.



నివేదిక వెల్లడిస్తున్న అధికారులు

రూ.16 వేల 762 జరిమానా

రూ.16 వేల 762ల జరిమానా విధించినట్లు డీఆర్డీఏ ఏపీడీ ఎస్.రవి తెలిపారు. టెక్నికల్ సిస్టెంట్లకు రూ.10 వేల 916లు, ఈసీకి రూ.318లు జరిమానా వేసినట్టు ఆయన చెప్పారు. అలాగే పంచాయతీ కార్యదర్శులకు, కంప్యూటర్ ఆపరేటర్లకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.5 వేల 528లు జరిమానా విధించినట్లు తెలిపారు. ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. సమావేశంలో అంబుడ్స్‌మన్ అధికారి నాగరాజు, డీవీఓ నర్సింహారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాస్, ఎస్టీఎం వేణు, ఎస్ఆర్పీ సురేందర్, ప్రోగ్రాం మేనేజర్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన ప్రజావేదిక

ప్రజావేదిక వెలవెలాబోయింది. సామాజిక తనిఖీ బృందం, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు మాత్రమే హాజరయ్యారు. ప్రజలు, కూలీలు హాజరు కాలేదు. భవిష్యత్తులో ఒత్తిళ్లకు తలొగ్గకుండా సామాజిక తనిఖీలు నిర్వహించి కూలీలకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మద్యం మత్తులోనే రోడ్డు ప్రమాదాలు

శాయంపేట : మద్యం మత్తులోనే తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవిస్తోందని పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మాందారిపేటలో పోలీస్ కళా జాగృతి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్న క్రమంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆపద సమయంలో డయల్ 100ను వినియోగించుకోవాలని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రణ, నేరస్తుల గుర్తింపు సులువౌతుందని తెలిపారు. గుట్కా, గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిస కావద్దని యువతను కోరారు.



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

మూఢనమ్మకాలు, తదితర అంశాలపై పాటలు, సాంస్కృతిక ప్రదర్శన ద్వారా కళాబృందం సభ్యులు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటికొండ మౌనిక రవికిరణ్, ఉపసర్పంచ్ కుక్కల భిక్షపతి, ఎంపీటీసీ గొట్టిముక్కుల స్వాతి విష్ణువర్ధన్‌రెడ్డి, జాగృతి కళా బృందం ఇన్‌చార్జ్ నాగమణి, కళాకారులు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, విక్రమ్ రాజ్, చిరంజీవి పాల్గొన్నారు.

నియంత తరహా పాలనపై పోరాటం

- గడప గడపకు కాంగ్రెస్ ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి : బీజేపీ సాగిస్తున్న నియంత తరహా పాలనపై ఏఐసీసీ జాతీయ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ రాజీలేని పోరాటం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. భీమదేవరపల్లి మండలంలోని రాంనగర్, మంగళంపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన 'గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యతోపాటు నిత్యావసర సరుకుల ధర పెంపునకు నిరసనగా రాహుల్ గాంధీ 150 రోజులపాటు 12 రాష్ట్రాల్లో 3 వేల 500 కిలోమీటర్ల భారత్ జోడో యాత్రను చేపట్టారని తెలిపారు. రాహుల్ గాంధీ యాత్ర స్ఫూర్తితో పార్టీ 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుందని వెల్లడించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి రాహుల్ పాదయాత్ర దోహదపడిందని చెప్పారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో అనేక అవకతవకలు ఉన్నాయని తెలిపారు. ధరణి పోర్టల్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఇంటికో ఉద్యోగం, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, తదితరాలను విస్మరించారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కర్ణాటక ప్రభుత్వ తరహాలో మహిళలకు ఆర్టీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని, రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్, సొంత స్థలంలో ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు సాయం, తదితర హామీలు నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరిన పలువురికి ప్రవీణ్‌రెడ్డి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తొలుత ఆయా గ్రామాల్లో రాహుల్ గాంధీ జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ టీపీసీసీ సభ్యుడు చిట్టంపల్లి అయిలయ్య, మాజీ మండల అధ్యక్షుడు కేతిరి లక్ష్మారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు రాజయ్య, కనుకయ్య, వెంకట్‌రెడ్డి, మంగ రామచంద్రం, చెవుల్ల బుచ్చయ్య, సుదర్శన్‌రెడ్డి, రవిందర్, శంకర్, అమల, గోపాల్‌రావు, సంపత్, శ్రీనివాస్, రవి, భిక్షపతి, ప్రకాశ్, గోపి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

హనుమకొండ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తి, పరకాల, కమలాపూర్, ధర్మసాగర్, వేలేరు, భీమదేవరపల్లి, దామెర, ఐనవోలు, శాయంపేట, ఆత్మకూరు మండలాల్లో ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి స్థానికులకు, ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. –సాక్షి నెట్‌వర్క్



పరకాల : పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



శాయంపేటలో..



ఐనవోలులో..



ధర్మసాగర్‌లో..



ఆత్మకూరులో..

పేదలకు 'డబుల్' ఇండ్లు కట్టించాలి

ఆత్మకూరు : పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టించాలని టీడీపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గన్నోజు శ్రీనివాసాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన 'గడపగడపకు గన్నోజు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు కరపత్రాలు పంచుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. టీడీపీ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణానికి నాటి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో ఎమ్మెల్యే ధర్మారెడ్డి శంకుస్థాపన చేయించారని గుర్తు చేశారు. వారందరికి తక్షణమే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, దళితులకు 3 ఎకరాల భూమి పంపిణీ చేయాలని, ఇతర హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రేగూరి సదన్న, గోనెల మధుకర్, రమణ, విజయ్‌పాల్‌రెడ్డి, భిక్షపతి, పోశయ్య, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

పరకాల : పట్టణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో దక్షిణ భాగాన మిగిలిన 500 గజాల స్థలంలో అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయ పరిపాలన అధికారి సంధ్యారాణికి అఖిలపక్షం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. సదరు భూమి అన్యాక్రాంతం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, కౌన్సిలర్లు జయంత్‌లాల్, కొలనుపాక భద్రయ్య, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, సీనియర్ నాయకుడు దుబాసి వెంకటస్వామి, పరకాల, నడికూడ మండలాల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, బుర్ర దేవేందర్‌గౌడ్, ఎస్సీ సెల్ రాష్ట్ర సెక్రటరీ కూరాకుల భారతి, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు, పట్టణ అధ్యక్షుడు పసుల వినయ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు బొచ్చు కళ్యాణ్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ప్రజాసంఘాల నాయకులున్నారు.

పరామర్శ

ఆత్మకూరు : మండలంలోని హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన నిమ్మల సమ్మక్క,, గూడెప్పాడ్‌కు చెందిన పరికి గోపాల్, కామారం గ్రామానికి చెందిన లక్కర్సు మల్లయ్య ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు సోమవారం పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణు, మాజీ కోఆప్షన్ సభ్యుడు బాబుమియా, నాయకులు సుమన్, లింగమూర్తి, అంకతి రవి తదితరులు పాల్గొన్నారు.



న్యూట్రిషన్ కిట్లను వినియోగించుకోవాలి



దామెర : లబ్ధిదారులు న్యూట్రిషన్ కిట్లను వినియోగించుకోవాలని జెడ్పీటీసీ గరిగె కల్పన కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆమె కిట్లనుఉ పంపిణీ చేసి మాట్లాడారు. గర్భిణులు పౌష్టికాహారం అధికంగా తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకే సీఎం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను అందజేసే కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్, తహసీల్దార్ రియాజుద్దీన్, మెడికల్ ఆఫీసర్ ఉషారాణి, ఎంపీటీసీ పోలం కృపాకర్‌రెడ్డి, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, కోఆప్షన్ సభ్యుడు హింగె బాబురావు, అశోక్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్కుల పంపిణీ

ఎల్కతుర్తి : మండలంలోని బావుపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న 50 మంది విద్యార్థులకు స్థానికుడు, పూర్వ విద్యార్థి దాట్ల అయిలయ్య సహకారంతో ప్రధానోపాధ్యాయుడు రాజేందర్ రూ.10 వేలు విలువైన నోట్ బుక్కులను సోమవారం పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు. అయిలయ్య సొంత డబ్బులతో రూ.10 వేలు విలువైన పుస్తకాలు అందించారని తెలిపారు. పాఠశాల మీద మమకారంతో విద్యార్థులకు పుస్తకాలు అందించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మల, సునీత, రవికుమార్, స్థానికుడు బత్తిని చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం రాజేందర్

గ్రామ పంచాయతీకి స్వర్గరథం అందజేత

దామెర : స్థానిక గ్రామ పంచాయతీకి మండల కేంద్రానికి చెందిన చల్ల సమ్మయ్య, భగత్ కుటుంబీకులు స్వర్గరథాన్ని అందజేశారు. ఈ మేరకు వారు ఎస్సై ముత్యం రాజేందర్, సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డిలకు సోమవారం స్వర్గరథం తాళం చెవులను అందజేశారు. అనంతరం సమ్మయ్య పెద్ద కొడుకు రవి మాట్లాడారు. గతేడాది మృతి చెందిన సమ్మయ్య, భగత్‌ల జ్ఞాపకార్థం గ్రామస్తుల సౌకర్యార్థం రూ.3 లక్షల విలువైన స్వర్గరథం వాహనాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేశ్, ఏఎస్సై సిద్దయ్య, చల్లా రాజశేఖర్, చల్లా కృష్ణ, చల్లా అశోక్, చల్లా యాదమ్మ, చల్లా రమ తదితరులు పాల్గొన్నారు.



స్వర్గరథం తాళం చెవులను అందజేస్తున్న చల్లా రవి

బీసీ కార్పొరేషన్ రుణమివ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న వార్డు సభ్యుడు బెరుగు సాగర్, తదితరులు

శాయంపేట : బోయ (వాల్మీకి) కులస్తులకు లక్ష రూపాయలు చొప్పున బీసీ కార్పొరేషన్ నుంచి రుణమివ్వాలని కోరుతూ తహసీల్దార్ రాజుకు వార్డు సభ్యుడు బెరుగు సాగర్ సోమవారం వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బెరుగు గోపి, సతీశ్, రాజు, తట్ల వెంకన్న, చల్లా సూర్యప్రకాశ్, దేశెట్టి లక్ష్మణ్, మొట్ల మల్లమ్మ, డంగు రమేశ్, బోగి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.